

ఉమ్మడి జిల్లాకు రూ.300 కోట్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలోని వెనుకబడి ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామని కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రూ.300 కోట్లు నిధులు రానున్నాయి. చిత్తూరు జిల్లాకు 150 కోట్లు, తిరుపతి జిల్లాకు రూ.150 కోట్లు కలిపి కేంద్రంనుంచి రానున్నాయి. వీటితోపాటు ఇటీవల ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నీతిఅయోగ్ సమావేశంలో పాల్గొని నిధులు త్వరగా ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి పంకజ్‌చౌదరి నీతిఅయోగ్ సిఫార్సుల మేరకు ఎపిలో వెనుకబడిన ఏడు జిల్లాలకు 2,100 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ నిధులను రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వసతి తదితర మౌలిక సదుపాయాలకు వినియోగించనున్నారు.

స్కీమ్ వర్కర్లపై 'అధికార' పగ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ అధికార పార్టీ స్కీం వర్కర్లపై పగబడుతోంది. ఓటు తమకు వేయలేదన్న అక్కస్సుతోనూ, ఆయా పోస్టుల్లో తమవారిని నియమించుకోవాలన్న ఆశతోనూ స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకూ, కక్షలకు దిగుతోంది. ఫలితంగా పలువురు స్కీం వర్కర్లు తమ చిరు ఉద్యోగాలను కోల్పోతుండగా.. ఇంకొందరు తీవ్ర మనోవేదనకు గురవుతూ మంచాన పడుతున్నారు. దీంతో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ తమకీ రాజకీయ వేధింపులు తప్పవా అంటూ స్కీం వర్కర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎప్పటిలాగే యధావిధిగా స్కీం వర్కర్ల పరిధిలోకి వచ్చే అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, అంగన్వాడి ఆయాలు, సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల ఆయాలపై అధికార, రాజకీయ వేధింపులు షురూ అయ్యాయి. ఇప్పటికే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలువురు సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు పడ్డట్లు సమాచారం. అదేవిధంగా పలువురు అంగన్వాడీలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు కూడా సహకరిస్తుండడంతో స్కీమ్ వర్కర్ల వేదన వర్ణనాతీతమనే చెప్పాలి.

ఇప్పటికే పలువురిపై వేటు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఈ రెండు నెలల కాలంలోనే అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు శ్రీకాళహస్తి మండలంలో 11 మంది క్షేత్ర సహాయకులను తొలగించినట్లు సమాచారం. అయితే వీరిలో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వం మారగానే స్వచ్ఛందంగానే రాజీనామాలు చేసినట్లు ఉపాధి హామీ ఎపిఓ చెబుతుండటం గమనార్హం. పుల్లారెడ్డి కండిగలో క్షేత్ర సహాయకుని తొలగించేందుకు ఆగస్టు 3న రంగం సిద్ధం చేశారని తెలిసింది. అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం పంచాయతీలో ఓ అంగన్వాడి కార్యకర్త, ఎంపేడు అంగన్వాడి కార్యకర్తపై వేటువేయాలని రాజకీయ ఒత్తిళ్ళు మొదలైన సంగతి అందరికీ తెలిసిందే. అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలో ఏడుగురు సంఘమిత్రలను తొలగించేందుకు రాజకీయంగా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. తొట్టంబేడు మండలంలో ఇద్దరు క్షేత్ర సహాయకులను తొలగించినట్లు తెలిసింది. 11 మంది సంఘమిత్రలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తొట్టంబేడు మండలంలోని బోనపల్లి దళితవాడలో అంగన్వాడి ఆయా ఇంటికి అధికారి పార్టీ నేత ఒకరు వచ్చి మర్యాదగా తొలగిపోవాలని హెచ్చరించి వెళ్లడం స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇటీవల శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో వేరొక పార్టీకి ఓటు వేశారని అక్కస్సులో ప్రభాకర్, లోకనాథం, భువనేశ్వరి అనే పారిశుద్ధ్య విభాగం కార్మికులను తొలగించిన సంఘటన చోటు చేసుకుంది.

రాజకీయ కక్షతో పలువురిపై వేటు

నేడు స్కీం వర్కర్ల ధర్నా

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం 10.30 గంటలకు సిఐటియు అనుబంధ సంఘాల స్కీం వర్కర్లు అధికార, రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టనున్నారని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా వ్యవహరిస్తున్న కూటమినేతల తీరు తీవ్ర ఆక్షేపణీయమని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న స్కీమ్ వర్కర్లకు ఎర్ర జెండా అండ ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

మాట తప్పిన కూటమి నేత

ఈ ఏడాది మొదట్లో తమ న్యాయపరమైన హక్కుల సాధన కోసం, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. దాదాపు నెలకు పైగా విధులకు గైర్హాజరై తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ నేపథ్యంలో నిరసనలో పాల్గొన్న స్కీమ్ వర్కర్లపై గత వైసిపి ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తిలో కూటమినేత, ఆయన కుటుంబం పెద్ద ఎత్తున స్కీం వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలియజేసింది. సమ్మెకు మద్దతుగా దీక్షలో పాల్గొంది. సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడి కార్యకర్తలకు, ఆయాలకు, మున్సిపల్ కార్మికులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేస్తామనీ, వారి న్యాయపరమైన డిమాండ్లన్నిటినీ పరిష్కరిస్తామనీ, మరీ ముఖ్యంగా స్కీం వర్కర్లకు రాజకీయ వేధింపులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ కూటమినేత ఆ మాటను మరిచినట్లున్నారు.

తీరు మారాలి :పెనగడం గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

అధికారం మారినప్పుడల్లా స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మొదలుపెట్టడం బాధాకరం. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలి. అలాకాకుండా చిరుద్యోగులపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. రాజకీయ నాయకులకు సహకరిస్తున్న అధికారుల తీరు మారాలి.

వైద్యం అందక బాలింత మృతి

ప్రజాశక్తి - సత్యవేడు

నాగమ్మ (ఫైల్‌ఫొటో)

మండలంలోని పేరడం ఎస్టీ కాలనీకి చెందిన మూడు నెలల పసికందు తల్లి నాగమ్మ సమయానికి వైద్యం అందక మృతిచెందిందని కుటుంబీకులు వాపోయారు. నాగమ్మ మూడు నెలల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు ఎలాంటి ప్రాథమిక వైద్యం అందించకనే తమిళనాడుకు చెందిన తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే నాగమ్మకు ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ వైద్యం ఫలించక మృతిచెందింది. సత్యవేడు మండల సిపిఎం కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ కాన్పు అనంతరం నాగమ్మకు అందాల్సిన వైద్యసేవలు సరిగ్గా లేందన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన నాగమ్మకు కనీసం ప్రాథమిక వైద్యం సైతం అందించకపోవడం వల్లనే మృత్యువాత పడిందని ధ్వజమెత్తారు. పేరడం ఎస్టీ కాలనీలో ఇది నాలుగో ఘటనని అన్నారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన అత్యవసర వైద్యసేవలు అందిస్తుండగా, రిమోట్ ఏరియా అయిన సత్యవేడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సేవలు అందడం లేదన్నారు. తమిళనాడు ఆస్పత్రులను ఆశ్రయించే లోపే మృత్యువాత పడుతున్నారన్నారు. సామాజిక వైద్యం షెడ్యూల్ తెగలకు అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగమ్మ మృతికి వైద్యులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. మూడు నెలల పసికందు భవిష్యత్ దృష్ట్యా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలన్నారు. సత్యవేడులో మెరుగైన అత్యవసర వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు. సిపిఎం నాయకులు కిష్టయ్య, చంద్రయ్య, సెల్వం, కేశవన్, సుశీల, అమూల్, రోసిలిన్‌లు నివాళి అర్పించారు.

సిపిఎం నేతల నివాళి

కుప్పం వైసిపి ఇన్‌ఛార్జిగా పెద్దిరెడ్డి సుధీర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపిని రాజకీయంగా ఎదుర్కొనేందుకు వైసిపి సిద్ధమవుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుపై పోటీచేసి ఘోర ఓటమిని చవిచూసిన ఎంఎల్‌సి భరత్‌ను పక్కన పెట్టి, ఆయన స్థానంలో పెద్దిరెడ్డి తమ్ముని కొడుకు సుధీర్ రెడ్డిని నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఎన్నికలు ముగిసాక టిడిపి దాడుల నుంచి కార్యకర్తలకు భరోసా ఇవ్వకుండా పరారైన భరత్‌ను పూర్తిస్థాయిలో వైసిపి నుంచి పక్కన పెట్టాలని జగన్ చూస్తున్నట్లు సమాచారం. ఇటీవల కుప్పంలో వైసిపి కార్యకర్తలను టిడిపివారు ఇంటికెళ్లి దౌర్జన్యం చేయడం, భౌతికంగా దాడులు చేశారు. అయితే భరత్ కనీసం కార్యకర్తలకు భరోసా ఇవ్వలేకపోయారన్నది వైసిపి కార్యకర్తల ఆరోపణ. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గరకు వెళ్లి వారు వాపోయినట్లు సమాచారం. 'మీరు చెబితేనే కదా మేం ఐదేళ్లు ధైర్యంగా నిలబడి చంద్రబాబును సైతం లెక్కచేయకుండా ఆందోళనలు చేశాం. స్థానిక ఎన్నికల్లోనూ అన్ని స్థానాల ఏకగ్రీవానికి ప్రయత్నించాం. ప్రస్తుతం మా పరిస్థితి ఏంటి.. టిడిపివారు దాడులు చేస్తుంటే ఇబ్బందులు పడాలా' అని పెద్దిరెడ్డి చెంత బాధపడ్డారు. అయితే పెద్దిరెడ్డి సైతం తమస్థాయిలోనూ అధికార పార్టీ నుంచి భారీగా దాడులు జరుగుతున్నాయని, కుప్పం కార్యకర్తలను ఆదుకునే బాధ్యత తనదేనని, తన తమ్ముని కుమారుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సైతం సుముఖత వ్యక్తం చేసి జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. త్వరలోనే సుధీర్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం ఉంది.

ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి : చింతామోహన్

గూడూరు టౌన్ : ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్లను ఇందిరాగాంధీ హయాంలో ప్రారంభించామని, అవి నేడు మూతబడ్డాయన్నారు. వైసిపి హయాంలో ఎస్సీ కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయన్నారు. ఇండియా కూటమికి జగన్మోహన్‌రెడ్డి అవసరం ఏమాత్రం లేదన్నారు. సొంత చెల్లే ప్రతిరోజూ జగన్మోహన్‌రెడ్డిని విమర్శలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రామకృష్ణరావు, పూల చంద్రశేఖర్, నాగభూషణం, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

డిఆర్‌ఎంను కలిసిన రైల్వే పెన్షనర్స్ ఉద్యోగులు

ప్రజాశక్తి -రేణిగుంట

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంతకల్లు డిఆర్‌ఎం విజయ్ కుమార్‌కు, సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి జయశంకర్ చౌహాన్‌కు రైల్వే పెన్షనర్స్ ఉద్యోగులు మంగళవారం పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. అసోసియేట్ సెక్రటరీ జయంత్‌కుమార్ మాట్లాడుతూ పే కమిషన్ తరువాత ఇవ్వాల్సిన పెన్షన్ పే ఆర్డర్లను ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కార్డులు ఇవ్వాలన్నారు. అరవింద్, అగర్వాల్ కంటి ఆస్పత్రులకు రైల్వే ఉద్యోగులకు, పెన్షనర్లకు రిఫరల్ ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలన్నారు. రేణిగుంట సంతగేటు దగ్గర ఉన్న గేటు కింద బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఛైర్మన్ ఎస్.అసన్ సాహెబ్, పంచాయతీ ప్రెసిడెంట్ ఆర్.నాగేశం, బ్రాంచి కార్యవర్గ సభ్యులు ఆర్‌ఎస్ జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, యంత్రాంగం

మానవ అక్రమ రవాణాను అరికట్టాలని సీనియర్ న్యాయవాది మురగేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం పురస్కరించుకుని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరిరక్షణలో ఉండాలన్నారు. పిల్లలు ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నపుడు 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. పిల్లల్ని ఒంటరిగా బయటకు పంపకూడదన్నారు. ప్రిన్సిపల్ శేషగిరి మాట్లాడుతూ పిల్లలు ఏడుతరం అనే పుస్తకాన్ని చదవాలని సూచించారు.

తిరుపతి కలెక్టరేట్ ఎదుట వాక్ ఫర్ ఫ్రీడం గ్రామ జ్యోతి వారి సౌజన్యంతో ప్రపంచ మానవ అక్రమ రవాణా నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. అమరనాథ్ మాట్లాడుతూ బాలలు, యువతలు, మహిళలు రవాణా సమయంలో గానీ, పనిచేసే ప్రదేశాల్లో గానీ హింసకు గురైతే బలవంతపు తరలింపుకు గురికాకుండా ప్రతి మానవుని హక్కును కాపాడాలన్నారు. చందమామల కోటయ్య, పి.వెంకటేష్, కె.శివ, ఎం.నాగరత్న పాల్గొన్నారు. ఏర్పేడులో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. పత్తిపుత్తూరు జడ్‌పి హైస్కూల్, కందాడ జడ్‌పి హైస్కూల్, బండారపల్లి జడ్‌పి హైస్కూల్, ఓబులాయపల్లి జడ్‌పి హైస్కూల్లో కార్యక్రమాలను నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ ట్రాపింగ్ అనేది జుగుప్సాకరమైన నేరమన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ చట్టాల గురించి, టోల్‌ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. ఓబులాయపల్లి పంచాయతీ జిల్లా పరిషత్ పాఠవాలలో శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అధికారిణి ఆర్.భువనేశ్వరి పాల్గొనానరు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి రమణ పాల్గొన్నారు.

డిపిఓ కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కాల్ సెంటర్‌ను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వారి కార్యాలయము, తిరుపతి నందు ఏర్పాటు చేశామని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ కాల్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కాల్ సెంటర్ యొక్క ఫోన్ నెంబర్ 9441725450. ప్రజలు పైన తెలిపిన ఫోన్ నెంబర్‌కు పని దినాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటలు వరకు ఫోన్ కాల్ ద్వారా కానీ, లేదా వాట్సాప్ ద్వారా కానీ పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీరు, అంటువ్యాధుల వ్యాప్తి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, డివిజనల్ పంచాయితీ అధికారిణి రూపా రాణి పాల్గొన్నారు.

సత్వరమే ప్రజా సమస్యలు పరిష్కారం : మేయర్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్ సంబంధించి మల్లయ్య గుంట కట్ట వద్ద మంగళవారం ఉదయం మేయర్ అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని, మరమ్మతులు చేసి సరఫరా చేయాలని కోరారు. ఖాళీ జాగాల్లో పిచ్చి మొక్కల వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. బోర్లు వెంటనే మరమ్మతులు చేయించాలని, దోమలు వ్యాపించకుండా పిచికారీ చేయాలని ఆదేశించారు. మేయర్ వెంట నగర పాలక ఇంజినీర్ చంద్రశేఖర్, నరేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాల్వల్లో చెత్త తొలగించండి : కమిషనర్

చిన్న పెద్ద మురుగుకాల్వల్లో చెత్తను తొలగించాలని హెల్త్, ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామునుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జివిపి పాయింట్లు లేకుండా శుభ్రం చేయాలని హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఇలు విజయ్‌కుమార్‌రెడ్డి, సంజయ్‌కుమార్ ఉన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మేయర్

నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష మంగళవారం ఉదయం తిరుపతి తాయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందించారు.

కమిషనర్‌ను కలిసిన సుగుణమ్మ

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యను మాజీ ఎంఎల్‌ఎ మన్నూరు సుగుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. 50వ డివిజన్‌లోని తిరుమల, శెట్టిపల్లి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.నాయకులు చినబాబు, సూర సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమేష్, బిజి కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి తరువాత రోజానే టార్గెట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మదనపల్లి సబ్‌కలెక్టరేట్ దగ్ధం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూర్తిగా ఇరుక్కుంటున్నారు. ఇప్పటికే ఆ ఘటనలో పెద్దిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించిన ఇద్దరు ప్రభుత్వ అధికారులపై వేటు పడింది. అలాగే తంబళ్లపల్లి, మదనపల్లి ఎంఎల్‌ఎలపైన కేసులు నమోదయ్యాయి. దాదాపు 950 కోట్ల పైగా విలువ చేసే భూ ఆక్రమణల్లో పేదలే సమిధలు. మదనపల్లి ఘటన జరగడంతో స్వయంగా బాధితులైన పేదలు పెద్దిరెడ్డి అనుచరులు గత ఐదేళ్లలో చేసిన అరాచకాలను చెప్పుకునేందుకు విచారణ అధికారుల ముందు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ శాఖలను అడ్డు పెట్టుకుని పెద్దిరెడ్డి భూములను, ఖనిజాలను ఏ విధంగా కొల్లగొట్టింది నివేదిస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా పెద్దిరెడ్డిపై కేసులు నడవనున్నాయి. పుంగనూరు ఘటనలోనూ పెద్దిరెడ్డి మెడకు మరిన్ని చుట్టుకోనున్నాయి. ఈ భూఆక్రమణల కేసులో పిఎల్‌ఆర్ గ్రాంట్స్‌లో పనిచేస్తున్న కొంతమందిని దుబాయ్, ఆఫ్రికా దేశాలకు పాస్‌పోర్టులు ఇచ్చి పంపించినట్లు ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఈ ఘటన ఓ కొలిక్కి వచ్చిన తరువాత మాజీ మంత్రి ఆర్‌కె రోజాపైనా అధికార పార్టీ కేంద్రీకరించనుంది. ఈ ఐదేళ్ల కాలంలో దోచుకున్న వైనాన్ని ప్రభుత్వం ఆరా తీస్తోంది. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలో ప్రతి శాఖలోనూ ఆమె చేతివాటం ఉందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా తిరుమల శ్రీవారి దర్శనాల్లో కోట్ల రూపాయలు సంపాదించారన్నది ఆమెపై ఉన్న ప్రధాన ఆరోపణ. మంత్రిగా ఉన్నపుడు నోటి దురుసుతనంతో చంద్రబాబు, పవన్, లోకేష్‌లపై ఘాటుగా విమర్శలు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసిపి ప్రధాన నాయకత్వంపైన టార్గెట్ పెట్టుకున్న నేపథ్యంలో ఆర్‌కె రోజా చెన్నయ్‌లో సెటిలై ఇంటికే పరిమితమైనట్లు తెలుస్తోంది. తొలుత తిరుమల సిఫార్సు లేఖల లెక్కలు తీయనుంది.

జనసేనను ఆశ్రయించిన డ్వాక్రా బాధితురాలు

తిరుపతి టౌన్ : ఆర్పీ హేమలత డ్వాక్రా డబ్బులతో వడ్డీ వ్యాపారం చేస్తూ సామాన్యుల నుంచి పదింతలు వడ్డీ వసూలు చేస్తోందని, వడ్డీ చెల్లించటం తన వల్ల కాదని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినా పోలీసులు న్యాయం చేయలేదని బాధితురాలు గాయత్రి వాపోయింది. మంగళవారం జనసేన నాయకులు కిరణ్‌రాయల్‌ను ఆశ్రయించింది. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోయింది.

రేపటినుంచి హెల్మెట్ తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆగస్టు 1 నుంచి పౌరులు ఎవరైనా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌పి సుబ్బరాయుడు అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పి ఎఫ్ ఐ తిరుమల స్టీల్ జనరల్ మేనేజర్ పెంచలయ్య 120 హెల్మెట్స్‌ను, రాస్ ఫౌండేషన్ వెంకటరత్నం 120 వైట్ కౌబాయ్ క్యాప్స్‌లను, తిరుపతి గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ తరపున సత్యనారాయణ 30 బ్యాటన్స్, 50 రేడియం జాకెట్స్‌ను తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు ఉచితంగా అందజేశారు. స్థానిక రామచంద్ర పుష్కరిణి ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు వ్యాపారులు ,వాహనదారులు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సిగ్నల్ పాయింట్ వద్ద అతిక్రమించిన వారిపై దురుసుగా ప్రవర్తించకుండా నవ్వుతూనే మాట్లాడి పెనాల్టీ వేయాలన్నారు. రాష్ట్ర హైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఆగస్టు 1వ తేదీ నుండి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, తిరుపతి ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

సిపిఎం ఆధ్వర్యంలో పేదల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణ పరిధిలోనిజక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లోని మురికినీరు పోకుండా దారికి అడ్డంగా గోడ కట్టిన ప్రైవేట్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్‌చేశారు. జోగి శివకుమార్ మాట్లాడుతూ సర్వే నంబర్ 531లో దాదాపు 50 సెంట్లు ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా 52 మంది నిరుపేద వ్యవసాయ కార్మిక కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. 2023లో ప్రభుత్వం స్పందించి సిసి రోడ్లు నిర్మించిందన్నారు. అయితే రెండు నెలలుగా డ్రైనేజీ నీటిని కాల్వలోకి పోనీకుండా అడ్డంగా గోడ కట్టారన్నారు. పోలీసుల సాయంతో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం పేదలపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, మురికినీరు సక్రమంగా పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నాయకులు పి.శ్రీనివాసులు, బివి రమణయ్య, బి.చంద్రయ్య కోరారు.

తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియా వేదిక నేతల నిరసన

అరవింద్ కేజ్రీవాల్స్ తక్షణం విడుదల చేయాలి

ఇండియా వేదిక నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్స్ తక్షణం విడుదల చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ, ఇండియా ఫోరం నేతలు డిమాండ్ చేశారు. ఆప్ జాతీయ కమిటీ పిలుపు మేరకు తిరుపతి బస్టాండ్ సమీపంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బిజెపి రాజకీయ కక్షతో నిర్బంధించడం హేయమైన చర్యన్నారు. కోర్టులో బెయిన్ ఇచ్చినా నిరంకుశంగా దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఈడీలను దుర్వినియోగం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్య సమస్యలతో దినదినం క్షీణించడం చూస్తుంటే బిజెపి చంపాలని కుట్ర చేస్తుందన్న అనుమానం కలుగుతుందన్నారు. తక్షణమే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట చలపతి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడివాక చందు, ఇండియా ఫోరం నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, పి.మురళి, సుబ్రమణ్యం, మాధవక్రిష్ణ పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీలలో మంగళం ట్రెండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవుల నాయుడు తెలిపారు. రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఏడు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు మూడు కాంస్య పథకాలను సాధించారన్నారు. తిరుపతి జిల్లా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించుటలో మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. మంగళవారం ఉదయం జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, సాంబశివరావు, ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు, చంద్రశేఖరయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్టులో మహారాష్ట్రలోని నాందేడ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

జాతీయ జంప్ రోప్ పోటీలకు బిసిఎం విద్యార్థులు

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బిసిఎం)విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎనిమిది మంది బిసీఎం విద్యార్థులు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల వ్యవస్థాపకులు కష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఈనెల 27,28 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు బిసిఎం పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రియా మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారికి ఉపయుక్తంగా ఉండే క్రీడలను పాఠశాలలో నేర్పిస్తున్నామన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, పిఈటి ప్రమీన, ప్రత్యేకంగా అభినందించారు.

దుస్తుల పంపిణీ

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు బాలాజీ నగర్ లోని ప్రగతి సేవా సంస్థ కార్యా లయంలో ఎద్దు భాస్కర్ కుమా రుడు రంజిత్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సెక్రెటరీ జి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, రాము, కెఆర్ఎం, నక్క వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, నాగరాజు, పోతిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు భూములు, స్థలాలు, ఇళ్ల తదితర ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిబంధనల మేరకు మాత్రమే సకాలంలో నాణ్యతగా పూర్తి చేసి ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో తిరుపతి జిల్లాలోని జిల్లా రిజిస్ట్రార్, 16 మంది ఉప రిజిస్ట్రార్లతో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ఉప రిజిస్ట్రార్ కార్యాలయాలలో రికార్డుల భద్రత పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూముల మొత్తం విస్తీర్ణం, డీ నోటిఫైడ్ విస్తీర్ణం, రిజిస్ట్రేషన్ చేయబడిన వివరాలపై సమీక్షిస్తూ నిబంధనలు ఉల్లంఘనలు ఉండరాదని, ప్రజా సేవలు నాణ్యతగా సకాలంలో అందించాలని అన్నారు. రీ సర్వే గ్రామాల భూముల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ, తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ అధికారి శ్రీ రామ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైస్కూలు ప్లస్ 2024 సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న ఎంపీసి, బైపీసి, సీఈసి, హెచ్ఈసీ, విద్యార్థులకు మంగళవారం పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు చేతుల మీదుగా ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, జనార్ధన రాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లత, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ఉపాధ్యాయులు, సిఆర్‌పి శివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వంద శాతం పింఛన్లు పంపిణీ: ఎంపిడివో

ఎంపిడివో త్రివిక్రమరావు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఆగస్టు ఒకటవ తేదీ ఉదయం 6 గంటల నుంచి సామాజిక భద్రత పింఛను సొమ్మును పంపిణీ చేస్తామని ఎంపిడివో త్రివిక్రమరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందిస్తారని తెలిపారు. మండలంలో 5178 మంది పింఛన్ దారులకు మూడుకోట్ల45 లక్షల95వేల ఐదువందల రూపాయలు సచివాలయ సిబ్బంది ద్వారా అందించనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో ప్రధానంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు వున్నాయని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీనే వందకు వంద శాతం పింఛను సొమ్ము పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో దూరపు ప్రాంతాల్లో ఉన్న పెన్షన్ లబ్ధిదారులు ఆగస్టు ఒకటో తేదీన(గురువారం) వారి వారి ఇళ్లకు చేరుకుని అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

సత్యవేడు: సత్యవేడు మండలంలో ఆగస్టు ఒకటవ తేదీన ఉదయం 6 గంటల నుంచి సామాజిక భద్రత పింఛను సొమ్మును పంపిణీ చేస్తామని స్థానిక ఎంపిడివో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలో 7,348 మంది పింఛన్ లబ్ధిదారులకు మూడు కోట్ల ఆరు లక్షల 33 వేల రూపాయలు సచివాలయ సిబ్బంది ద్వారా అందించనున్నట్లు ఆయన వివరించారు.

'చిన్నరాజుకుప్పం అభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక చిన్న రాజుకుప్పం గ్రామానికి తన సొంత గ్రామం చిన్నరాజు కుప్పం అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చిన్నరాజు కుప్పం అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, గ్యాస్ స్టవ్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాఠశాలకు త్వరలోనే కంప్యూటర్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి నాయకులు పోతుగుంట రమేష్, దాసరి విజయ్ చౌదరి, అంగన్ వాడీ టీచర్ భారతి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయనాగు, ఉపాధ్యాయులు లోకనాథం, చిన్నరాజుకుప్పం మాజీ సర్పంచ్ కృష్ణమండి, గ్రామస్తులు బొల్లిని ధనంజయులు నాయుడు, చినపాప, ప్రమీల పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి: ఏవో

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలు చేయించుకుని వాతావరణానికి తగిన విధంగా నాణ్యమైన విత్తనాలు వినియోగించాలని ఏవో ప్రవీణ పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలోని నెలబల్లి లో వరదలు శాఖ తిరుపతి జిల్లా వనరుల శాఖాధికారి కెవి శ్రీనివాస్‌తో కలిసి ఏవో పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికెలు సిబ్బంది అశోక్, రైతులు పాల్గొన్నారు.

గోవుల అపహరణ

ప్రజాశక్తి - బాలాయపల్లి : గోవులను గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళల్లో అపహరిస్తున్న సంఘటన మండలంలోని వెంగమాంబపురం, యాచవరం, పద్మారం చేను గ్రామాల్లో చోటుచేసుకుంటున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం ఒకే రోజు నాలుగు ఆవులు ఇళ్లల్లో కట్టేసి ఉండగా మెడ పలుపులతో సహా ఆవులను దుండగులు అపహరించుకొని పోయినట్లు వెంగమాంబపురానికి చెందిన దామా గురుమూర్తి, పద్మారం చెందిన ఇద్దరు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు నెలల కాలంలో సుమారు 10 ఆవులు అపహరణకు గురైనట్లు ఆయా గ్రామాల్లోని ప్రజలు తెలిపారు.

ఆక్రమణ షెడ్డును తొలగించండి: ఇన్‌ఛార్జి తహశీల్దారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ కోళ్ల ఫారాలు సమీపంలో ఆక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించాలని తిరుపతి అర్బన్ మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు అశోక్ రెడ్డి అక్రమ నిర్మాణ దారులకు సూచించారు. మంగళవారం కోళ్ల ఫారాలు సమీపంలోని సర్వేనెంబర్ 226లో నిర్మించిన ఆక్రమ షెడ్డును పరిశీలించి నిర్మాణ దారుడు హెచ్చరించారు. లేదంటే జెసిబి తో కూల్చివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆర్‌ఐ జాని బాషా, వీఆర్వో సుమన్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయులు ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ శాఖకు తగిన నిధులు కేటాయించ చక పోగా ఎరువులు, పురుగు మందుల ధరలు పెంచడమే కాక, రైతులకు హామీ ఇచ్చిన మేరకు గిట్టుబాటు ధరకు చట్టం చేయకుండా రైతులను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా బడ్జెట్ ప్రతులను దహనం చేశామని తెలిపారు.

గ్రంథాలయానికి లైబ్రేరియన్ కరువు

- వారానికి మూడు రోజులు మాత్రమే గ్రంథాలయం
- పాఠకుల అవస్థలు

ప్రజాశక్తి- సత్యవేడు: పాఠకులకు విజ్ఞానం పెంపొందించే సత్యవేడులో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి శాశ్వత లైబ్రేరియన్ లేక వారానికి మూడు రోజులు మాత్రమే తెరిచి వుండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి గ్రంథాలయానికి లైబ్రేరియన్ లేకపోవడంతో నాగలాపురం గ్రంథాలయ లైబ్రేరియన్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ కారణంగా సత్యవేడు మండల గ్రంథాలయం వారంలో మూడు రోజులు మాత్రమే తెరిచి ఉంటోంది. దీంతో ఈ గ్రంథాలయానికి వచ్చే పలువురు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.

సత్యవేడు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు సమీపాన గాంధీ రోడ్డు వద్ద ఉన్న గ్రంథాలయం మూసి ఉండడంతో ప్రతిరోజు చదువుకునే పాఠకులు, ఉద్యోగులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు నిరాశకు గురవుతున్నట్లు తెలిపారు. గ్రంథాలయాన్ని వారంలో ప్రతి రోజూ పాఠకుల సౌకర్యార్థం తెరవాల్సివున్నా వారంలో మూడు రోజులు మాత్రమే తెరిచి ఉండడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రంథాలయానికి లైబ్రేరియన్ లేకపోవడంతో నాగలాపురం లైబ్రేరియన్ ప్రసాద్‌కు ఇన్‌ఛార్జికి అప్పగించారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు స్థానిక ఆలయంలో సోమ మంగళ బుధ వారాలలో విధులు నిర్వహించి మిగతా మూడు దినాలు నాగలాపురంలో విధులు నిర్వహించడం వల్ల ఈ పరిస్థితి ఇలా వచ్చిందని స్థానికులు లువాపోతున్నారు. గ్రంథాలయంలో పుస్తక పఠనానికి అలవాటు పడ్డ ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు గ్రంథాలయం మూసి ఉండడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. గ్రంథాలయం అందుబాటులో లేక పోవడంతో పోటీ పరీక్షకు తయారవుతున్న విద్యార్థులు అవస్థలు గురికాక తప్పడం లేదు. ఈ విషయంపై ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌విఎస్ శర్మను వివరణ కోరగా సిబ్బంది కొరత వుండని ఒక్కొక్కరు రెండు శాఖలలో పని చేస్తున్నట్లుగా, ఉద్యోగ బదిలీలు చేపడితే రెగ్యులర్ సిబ్బంది ఏర్పాటుకు అవకాశం వుండని తెలిపారు.

మెనూ పాటించకపోతే చర్యలు

గురుకుల పాఠశాల సిబ్బందికి ఆర్‌డీవో హెచ్చరిక

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని సూళ్లూరుపేట ఆర్‌డీవో చంద్రముని సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలో ఉన్న సరుకులు, కూరగాయలను పరిశీలించి ప్రిన్సిపాల్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురుకులంలో అనేక సమస్యలు తిష్టి వేశాయని వీటిని సిబ్బంది ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. విద్యార్థులకు

గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న సూళ్లూరుపేట ఆర్‌డీవో చంద్రముని

సక్రమమైన వసతులు కల్పించి నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగు నీరు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలన్నారు. కాంట్రాక్టరు నాసిరకమైన కూరగాయలు, సరు కులను పంపిణీ చేస్తే వెనక్కి తిప్పి పంపి వేయా లన్నారు. విద్యార్థుల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు ఉన్నారు.

సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి డిఎస్‌పి రవి మనోహర్ ఆచారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 'మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్' అనే అంశాలపై ఉపాధ్యాయులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డ్రగ్స్ పెనుభూతం బారిన పడకుండా జాగ్రత్తగా వుండా లన్నారు. సైబర్ క్రైమ్ మహమ్మారి నేటి సమాజంలో విలయతాండవం చేస్తోందని, విద్యావంతులే ఎక్కువగా ఈ సైబర్ క్రైమ్ బారిన పడుతుండటం చాలా బాధాకరమన్నారు. సైబర్ నేరగాళ్ల మాటలకు ప్రలోభ పడి వ్యక్తిగత సమాచారం, ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి వివరాలు అపరిచిత వ్యక్తులకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటికి పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళా రక్షక్, రక్షక్, బ్లూ కోల్ట్ పోలీసులతో ఈవ్ టీజింగ్ జరగకుండా నియంత్రిస్తామన్నారు. అనవసరంగా కేసులలో ఇరుక్కుని విలువైన జీవితాన్ని, తమ కుటుంబ సభ్యుల జీవితాలను దుర్లభం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వెస్ట్ సిఐ జయ నాయక్, తిరుపతి సెబ్ అధికారులు, వెస్ట్ మహిళా రక్షక పోలీసులు పాల్గొన్నారు.

హోటళ్లు, జ్యూస్ దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి, తిరుపతి రోడ్డులలోని టీ, జ్యూస్ షాపులు, హోటళ్లను స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీఎం రెడ్డి, ఇన్‌ఛార్జి అధికారి ఇంద్రసేన నాయుడు కలిసి తనిఖీ చేశారు. దుకాణాలలో చట్టావిరుద్ధంగా ప్లాస్టిక్ , పేపర్ గ్లాస్ లు వాడి విచ్చలవిడిగా రోడ్డుపై వేసిన షాప్ యజమానులకు ప్రతి షాప్ ముందు బుట్టలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లేకుంటే జరిమానా వేయడంతో పాటూ షాపులు సీస్‌చేస్తామని హెచ్చరించారు. ఖతిజ హోటల్ లో కుళ్లిన పుట్టగొడుగులు, చికెన్, మసాలాలు ఉండడం వల్ల హోటల్ యజమానికి రూ. ఐదువేలు ఫైన్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా టీ కప్పులు వాడుతున్న టీ కొట్టు లోని కప్పని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధికి అంచనాలు రూపొందించండి: ఎమ్మెల్యే

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధికారులు అంచనాలు తయారు చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) కోరారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలంలో ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వాటర్ హెడ్ ట్యాంక్, నీటి కుళాయిలు, అండర్ డ్రైనేజ్, వాటి అనుసంధానం, కాలువలు వాటి మరమ్మతులు, ఇరిగేషన్ ఛానల్స్ వంటి అంశాలపై పంచాయతీ రాజ్, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, పరిశుభ్రత, నీటి పారుదల శాఖ కు సంబంధించిన అధికారులతో పలు సమస్యలను గుర్తించా లన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ వర్కులపై, వాటి పునరుద్ధరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గ అభివృద్ధికి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. అధి కారులు అభివృద్ధికి సహకరించా లని ఆయన కోరారు. ఈ సమా వేశంలో పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఇ శంకర్ నారాయ ణ, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ఈ కే విజయ్ కుమార్, డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివారెడ్డి, డి ఈ ఈ శంకర్ రెడ్డి, వెంకట రమణ, సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి నాయకులు ఎం తిరుమలరెడ్డి, ఏ ఈశ్వర్ రెడ్డి, శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

హోటళ్లు, దుకాణ యజమానులకు టిటిడి ఈవో హెచ్చరిక

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో పెద్ద, చిన్న హోటళ్లతో సహా అన్ని తినుబండారాల విక్రయ ప్రాంతాలలో వ్యర్థాలను తొలగించేందుకు రెండు చెత్త డస్ట్‌బిన్ల వ్యవస్థను నిర్వహించాలని టీటీడీ ఈవో జె శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల నుండి అభిప్రాయాన్ని పొందడానికి ఫిర్యాదులు, సూచనల పెట్టెను ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో పెద్ద జనతా క్యాంటీన్లు, ఏపీటీడీసీ హోటళ్లపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలోని అన్ని హోటళ్లలో చెత్తను తడిచెత్త, పొడి చెత్తగా సేకరిం చాలన్నారు. తమ హోటల్ ఆవరణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఆహార పదార్థాల ధరలతో ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటూ ఆహార పదార్థాలలో సింథటిక్ రంగులు నిషేధించబడిన రంగులు ఉపయోగించలేదు. 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు టేస్ట్ ఎంహేన్సర్ తో చేసిన పదార్థాలు తినకూడదని, హోటల్ లైసెన్స్ పొందిన వారు వాటిని ఎటువంటి సబ్ లీజుకు ఇవ్వలేదు. పెద్ద హోటల్స్ జనతా క్యాంటీన్లు తప్పనిసరిగా తమ హోటళ్ల పేర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. సవరించిన ధరలను రెవెన్యూ విభాగానికి సమర్పించాలన్నారు. తిరుమలలోని అన్ని క్యాంటీన్ల వారికి ఆగస్టు 5 వ తేదీ తర్వాత ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ శిక్షణ ఇస్తుందని, ఆ తర్వాత క్యాంటీన్లు, తినుబండారాలను తనిఖీ చేస్తామని తెలిపారు. వాటర్ బాటిళ్లు రూ.20కి మించి అమ్మకూడదని, తనిఖీ సమయంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయనహెచ్చరించారు. అనంతరం అన్నప్రసాదం, దాతల విభాగం, ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యకలాపాలు, సమస్యలను ఈవో సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవోలు రాజేంద్ర కుమార్, సెల్వం, ఆశాజ్యోతి, అదనపు ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు సునీల్ కుమార్, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

ఎస్వియూ స్టూడెంట్స్ మెస్ పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏ - హాస్టల్ ను మంగళవారం మధ్యాహ్నం ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను ఆహార పరిశుభ్రత , సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. రైస్ నాణ్యత పెంచాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రతి డైనింగ్ టేబుల్ వద్ద మంచినీటి జగ్ ను ఏర్పాటు చేయమని మెస్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. విద్యార్థులకు కల్పిస్తున్న భోజన వసతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరైన భోజన వసతి, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, మెస్ ల చుట్టూ పరిశుభ్ర వాతావరణం, వసతి గ్రహాలు చుట్టూ పరిశుభ్రతను పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. విసి ఆకస్మిక తనిఖీలు ఆయన వెంబడి ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు లేకపోవడం గమనార్హం. ఐసిడి యస్ వెంకటగిరి పరిధి లోని వల్లివేడు యస్. కాలలో వంద రోజుల స్పెషల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సిసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ అభివృద్ధికి, వడమాల పేట మండలం శ్రీబొమ్మరాజపురం గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ మణి రాజు దుశ్శాలువా, పూల బొకేతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని కష్టాలు ఎదురైనా గ్రామాలలో అభివృద్ధి దిశగా, గ్రామ ప్రజలకు మొదటి స్థానం కల్పిస్తూ సీసీ రోడ్లు, మురికి నీటి కాలువలు , తాగునీటి సమస్యలను పద్ధతి ప్రకారం పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. నగరి నియోజక వర్గంలోని వడమాలపేట మండలం శ్రీ బొమ్మరాజపురంలో ప్రధాన రహదారికి మొదట 10 లక్షల వ్యయంతో 170 మీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టామన్నారు. వడమాలపేట మండల అభివృద్ధి రూపురేఖలు మారుస్తా మన్నారు. గత ప్రభుత్వంలో ఆగిన అభివృద్ధి పనులను పునఃప్రారంభించి, ఎలక్ట్రానిక్ క్లస్టర్ చేపట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, మండల అధ్యక్షులు జానా వెంకటయ్య, పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయల నాయుడు, హేమావతి, లక్ష్మి ప్రసన్న, పెద్దబ్బ రాజు, సుకుమార్ రాజు, హరిరాజు, ప్రసాద్‌రాజు, యయాతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కొత్తపాలెం గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్ రుచికర, పిండి వంటల భోజనాన్ని మంగళవారం అందించారు. మండల విద్యాశాఖ కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమ్మఒడి దినోత్సవ్ భోజన వడకలో భాగంగా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్ సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు స్వీట్లు వడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని కల్లెవెట్టు ఉన్నత పాఠశాలలో భోజనం ద్వారా విద్యార్థులకు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ పాల్గొన్నారు. మునగల పాలెం ఉన్నత పాఠశాల కార్యక్రమంలో ఏర్పేడు జెడ్‌పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్య పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు పట్టణ పరిధి లోని గాంధీ నగర్‌లోని మినీ గురుకులంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా మంగళవారం పునాది అభ్యాసం, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యా అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో జూలైలో జన్మించిన తొమ్మిది మంది విద్యార్థులకు జన్మదినాన్ని నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెచ్‌ఎం మేరీ ప్రియత, ఐటిడిఎ ఏఎంఓ శాంతి కుమారి, జీసీడీవో శాంతి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రాచగున్నేరి పంచాయతీలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్, జెకె స్టీల్ అధినేత, టిడిపి సీనియర్ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్ష సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు పౌష్టిక ఆహారమైన యాపిల్, అరటి పండ్లు, ఖర్జూరం, వడ, పాయసం వంటి ఆహారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాచగున్నేరి గ్రామ పంచాయతీ సర్పంచ్ నర్రా భార్గవి, నర్రా అరుణ, బొల్లినేని కళావతి, ఉపాధ్యాయులు లింకన్, శాంత కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: శిక్ష సప్తాహ్‌లో ఏడవ రోజు సామాజిక భాగస్వామ్యం తిథి భోజనం కార్యక్రమంలో భాగంగా ఏర్పేడు మండలంలోని మునగల పాలెం ఉన్నత పాఠశాల లో నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పేడు జెడ్పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేల్రాజు, గ్రామ సర్పంచ్ మంజుల సతీష్ నాయుడు, మాజీ సర్పంచ్ వేణుగోపాల చౌదరి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సుధాకర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని పులియంగుంట, పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్లో మంగళవారం టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్ రెడ్డి, ఎంఈఓ లు హేమమాలిని, యుగంధర్ రాజుల ఆధ్వర్యంలో విద్యార్థులకు శుభ తిథి సహపంక్తి భోజనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇలంగోవన్ రెడ్డి, పులియంగుంట జడ్పీ హైస్కూలును ఆదర్శ పాఠశాలగా(రెసిడెన్షియల్ స్కూల్) రూపొందించే బాధ్యత తీసుకుంటున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు మునిశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, గోపి, బాలాజీ, ఆనంద్, గుండయ్య, శివయ్య, శ్రీనివాసులు, రాజా, రవి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: పిల్లలకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించటమే శిక్ష సప్తహ ఉద్దేశమని బుచ్చినాయుడు కండ్రిగ ప్రధానోపాధ్యాయులు రమణయ్య విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్ ముని సుబ్రహ్మణ్యం తెలిపారు. బుచ్చినా యుడు కండ్రిగ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో మంగళవారం తిథి సహ పంక్తి భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సత్యవేడు నియోజకవర్గ ప్రసిడెంట్, తిరుపతి జిల్లా ఏపీఈజే వైస్ ప్రసిడెంట్ బొర్రా వేణు 600 మందికి రుచికరమైన భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, పిల్లలు, ఉపాధ్యాయులకు మీడియా మిత్రులకు పులిహోర, పాయసంతో సహ అతిథులు, దాతలు అందరూ కూర్చొని భోజనం స్వీకరించారు.

బుచ్చినాయుడు కండ్రిగలో

తిరుపతి డెస్క్: పెళ్లకూరు మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం శిక్షా సప్తహ ఎడ్యుకేషన్ వీక్ ను విజయవంతంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు ,ఎంఆర్సి సిబ్బంది ప్రజా భాగస్వామితో కలుపుకుని నిర్వహించిన చివరి రోజు శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గూడూరు మండల పరిధిలోని చంబడి పాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. కర్లగుంట కొండయ్య (38) మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మొక్కల చేను యానాది కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుత్తూరు సంజీవ సింహ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నోటు పుస్తకాలు వితరణ చేశారు. గ్రామీణ విద్యార్థుల కోసం సంజీవ సింహ ట్రస్ట్ పుత్తూరు సేవ చేస్తోందని దాతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇలాంటి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంజీవ సింహ ఛైర్మన్ డి ఎన్ వెంకటేశులు మాట్లాడుతూ తాను కష్టపడి చదివి పైకి వచ్చానని చదువు విలువ తెలిసిన కారణంగానే పేద విద్యార్థులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సంజీవ సింహ ట్రస్ట్ ఛైర్మన్ తల్లిదండ్రుల పేరుపై ఈ సేవ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

క్యాన్సర్ అనుమానితులకు పరీక్షలు తప్పనిసరి

తిరుపతి సిటి : ఎంఎల్‌హెచ్‌పి యాప్ వివరాల మేరకు క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న మహిళలను, పురుషులను పింక్ బస్సు క్యాంపుల వద్దకు షెడ్యూల్ మేరకు తీసుకురావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. పింక్ బస్సుల్లో క్యాన్సర్ నిర్ధారణ అయిన వారిని అంకాలజీకి తప్పకుండా వెళ్లేలా ఎంఎల్‌హెచ్‌పిలు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం తిరుపతి కలెక్టర్ ఛాంబర్‌లో వర్చువల్ విధానంలో స్విమ్స్ బయో ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి డిఎంహెచ్‌ఓ శ్రీహరి, సిహెచ్సి, పీహెచ్ సి డాక్టర్లు, ఎంఎల్ హెచ్ పీ లు తదితర అధికారులతో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్ధారణ, చికిత్స, ఫాలో అప్ తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సుమారు 60వేల మందికి సర్వేలో క్యాన్సర్ అనుమానితులను గుర్తిస్తే వారిలో 8000 మంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు పింక్ బస్ కు హాజరైన వారిలో సుమారు 800 దాకా క్యాన్సర్ పాజిటివ్ నిర్ధారణ అయ్యాయని తెలిపారు. క్యాన్సర్ నిర్ధారిత రోగులను అందరికీ స్విమ్స్ ఆంకాలజీలో ఉచిత క్యాన్సర్ చికిత్స అందిస్తామన్నారు.

పశువైద్య విశ్వవిద్యాలయంలో వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పశువైద్య కళాశాలలో జీవశాస్త్ర విభాగంలో భారత జాతీయ వైద్య పరిశోధన మండలి వారి సహకారంతో ఐదు రోజుల వర్క్ షాప్ మంగళవారం సెమినార్ హాల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్వీ వైద్య కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధకులు ఇలాంటి వర్క్ షాప్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ కే వీర బ్రహ్మయ్య, డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీలత, డాక్టర్ బి జగపతిరామయ్య, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఆర్ శ్రీదేవి, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

భార్గవకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగపు పరిశోధక విద్యార్థి యలకంబేడు భార్గవకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ తెలిపారు. ఆచార్య జెయస్ఆర్ మూర్తి మార్గదర్శకత్వంలో 'ఐసోలేషన్ క్యారక్టరైజేషన్ ఆఫ్ సింబయాటిక్ నైట్రోజన్ ఫిక్సింగ్ బాక్టీరియా ఫ్రం వైల్డ్ లెగ్యూమ్స్ టు ఎన్హన్స్ క్రాప్ ప్రొడక్టివిటీ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. చంద్రగిరి మండలంలోని నరసింగాపురానికి చెందిన వై పార్థసారథి ఆచారి, వై సుగుణమ్మ దంపతుల కుమారుడు భార్గవ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు తెలిపారు. ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

వివాదాస్పద భూమిని పరిశీలించిన ఆర్‌డివో

ప్రజాశక్తి -రామచంద్రాపురం : మండలంలోని సి రామాపురంలో వివాదాస్పదమైన భూమిని తిరుపతి ఆర్ డి ఓ రిశాంత్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం సి రామాపురం గ్రామ లెక్క దాఖలాలోని సర్వేనెంబర్ 73/3కు సంబంధించిన భూమిని మండల రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి భూ వివాదాన్ని పరిష్కరిస్తానని ఆర్డిఓ తెలిపారు. ఈ పరిశీలనలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ పునీతారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, మండల సర్వేయర్ హేమ కుమార్, వీఆర్వో ఝాన్సీ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకు 'జగనన్న ఆర్థిక భరోసా'

ప్రజాశక్తి - తిరుపతి: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు చేస్తున్న దాడులకు ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్పందించారు. ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలపై సాగుతున్న దాడుల్లో గాయపడిన, ఆస్తులు కోల్పోయిన వారందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తూ చెక్కులు పంపిణీ చేశారు. జగనన్న పంపిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి బాధితుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. పాకాల మండలం రమణయ్య గారి పల్లి, ఊట్లవారి పల్లి , పాకాల టౌన్ కు చెందిన బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులు ఇచ్చి ధైర్యం చెప్పారు. తిరుపతి రూరల్ మండలంలో తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి శెట్టి పల్లి పంచాయతీ పరిధిలోని సప్తగిరి కాలనీ, మంగళం క్వార్టర్స్, తిరుమల నగర్ పంచాయతీల పరిధిలో గాయాలపాలై, ఆస్తులు పోగొట్టుకున్న వారికి జగనన్న పంపిన చెక్కులను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు.

ఎస్‌పి కలిసిన తెలుగు యువత నేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు యువత నాయకులు ఆనంద్ గౌడ్, వివేక్ చౌదరి, భీష్మలు మంగళవారం ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్‌పిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎల్ సుబ్బరాయుడుని మర్యాద పూర్వకంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, నందనం అకాడమీ ఛైర్మన్ పత్తిపాటి వివేక్ మర్యాదపూర్వ కలిసి పూల బొకే ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎస్పీతో తెలుగు యువత , నందనం అకాడమీ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ మూమెంట్ గురించి వివరించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని దీనికి ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ఎస్పీ తో అన్నారు. యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వాహణ పై ఆయన వారిని అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట

ప్రజాశక్తి -నాయుడుపేట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట , అధికారం పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కే శ్రీనివాసరావు అన్నారు. నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో ఆయన రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ తేలికపాటి కషాయాలతో వ్యవసాయం చేయడం వల్ల పంటలో నాణ్యత , ఆరోగ్యం లభిస్తుందని ఇప్పుడున్న ఈ పొల్యూషన్ లో ఇలాంటి వ్యవసాయాలు అందరూ నేర్చుకోవాలని తద్వారా సమాజానికి మంచి ఆహార పంటలను అందించవచ్చని తెలిపారు. పంటలకు రైతులకు అనుగుణమైన వ్యవసాయం చేసేందుకు బ్రహ్మాస్త్రం,నీమాస్త్రం,అగ్ని అస్త్రం ముల గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. నాయుడుపేట మండలం వ్యవసాయ అధికారి జె. గణేష్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని, ఎక్కువ రసాయన ఎరువులను వాడకుండా పశువుల ఎరువులు పచ్చి రొట్ట ఎరువులను సాగు చేసి భూమిని కలియదున్ని భూమి నాణ్యతను పెంపొందించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం వ్యవసాయ ఉన్నతాధికారి కె.శారద పాల్గొన్నారు.